ప్రజాశక్తి

బుధవారం 8 మార్చి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అక్రమాస్తులపైనా ఖాకీల ఆరా..!



'ఎకానమీ చిరంజీవిరావు' మెడకు నిఘా నివేదిక ఉచ్చు చుట్టుకోనుందా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎన్నికల ముందా ? ఎన్నికలయ్యాకా ? ఎప్పుడన్నది స్పష్టత లేకపోయినా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా టిడిపి నుంచి బరిలో ఉన్న వేపాడ (ఎకానమీ) చిరంజీవిరావుపై ఖాకీ లాఠీ వేలాడుతుందనే చెప్పాలి. ఇటీవల అక్రమ డబ్బుతో పాటు పట్టుబడ్డ ఆయనకు చెందిన డైరీలో పలు ఆర్థిక లావాదేవీల చిట్టా అంతా పూసగుచ్చినట్లు ఖాకీలకు లభ్యం అయ్యిందనడంలో సందేహం లేదు. దీంతో ఖాకీల నిఘా నివేదిక ఆయన చుట్టూ బలంగా అల్లుకుంటోంది. గతంలో 'ఎకానమీ చిరంజీవిరావు' ఎక్కడెక్కడ విధులు (పాఠాలు) ఎలా (చెప్పారు) నిర్వహించారు ? వచ్చిన ఆరోపణలేంటి ? అన్న అంశాలను దర్యాప్తులో అంశంగా చేర్చారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలోని సబ్బవరంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం చేస్తూ బయట విద్యావేత్తగా ఎకానమీ (ఆర్థిక వ్యవస్థ)పై క్లాసులు ప్రైవేట్‌గా తీసుకుంటూ కాలేజీకి ఎగనామం పెట్టిన తీరు, తెన్నూ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. 2016 నుంచి 2022 వరకూ అక్రమంగా సంపాదించిన రూ.కోట్ల సంపదపైనా.. గతంలో విశాఖ నగరం, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ప్రముఖ కోచింగ్ సెంటర్‌లో ఒక బ్యాచ్‌కి రూ.25 లక్షలు చొప్పున ఏడాదికి 12 బ్యాచ్‌లకు రూ.3 కోట్లకు పైగా సంపాదించిన అక్రమాస్తుల గురించిన వాకబు చేస్తున్నారు. పేద, దళిత, గిరిజన, బిసి నిరుద్యోగ విద్యార్థులను దగా చేసి వారికి సకాలంలో కోచింగ్ ఇవ్వకుండా కూడబెట్టిన అక్రమ సంపాదనపైనా గురిపెట్టారు. ఆయన ఉద్యోగానికి రాజీనామా చేసే వరకూ సంపాదన వ్యవహారాలను ఇంటెలిజెన్స్ అధికారులు సిద్ధం చేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది. తాను విద్యావేత్తనని, తనకు నిరుద్యోగ పట్టభద్రులంతా ఉత్తరాంధ్ర శాసన మండలి ఎన్నికల్లో ఓట్లేయాలని తాజాగా ఆయన ప్రచారం చేసుకోవడం, అదే క్రమంలో అవినీతి, అక్రమ ఆరోపణలు వెల్లువెత్తుతుండటం ఇప్పుడు ఉత్తరాంధ్రలో హాట్ టాపిక్‌గా ఉంది.

ఆయన తీరుపై నిరుద్యోగుల నుంచే పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార వైసిపిపై ప్రజల్లో పలు అంశాలపై అసంతృప్తి వ్యక్తమవుతున్న తరుణంలో తనను గెలిపిస్తే ఉత్తరాంధ్ర పట్టభద్రుల కోర్కెలు నెరవేర్చుతానంటూ నమ్మబలికే యత్నాలకు టిడిపి యంత్రాంగం దిగుతోంది. ఉత్తరాంధ్ర జిల్లాల సమస్యలపై సిపిఎం, ప్రజాసంఘాలు ఎప్పటి నుంచో పోరాడుతున్న సంగతిని ఈ ప్రాంతంలోని వివిధ తరగతుల ప్రజానీకం, అభ్యుదయ వాదులు, మేధావులంతా కొనియాడుతున్న నేపథ్యంలో 'విద్యావేత్త' ముసుగులో సదరు ఎకానమీ చిరంజీవిరావు ఓట్లడుగుతుండడం విడ్డూరమైన విషయమే. పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలబడ్డ డాక్టర్ కోరెడ్ల రమాప్రభ వైపునకు ఉత్తరాంధ్ర ప్రజానీకం, పట్టభద్రులు, మేధావులు చూస్తున్నారు. ఆమెది 'విలక్షణమైన అభ్యర్థిత్వం' అంటూ కొనియాడుతున్నారు. చట్టసభల్లోనూ, బయటా నిజమైన పోరాటాల వారసత్వంగల పిడిఎఫ్‌ను బలపరుస్తూ బ్రహ్మరథం పడుతున్నారు. వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ప్రభుత్వంపైగల వ్యతిరేకత పిడిఎఫ్‌కు కలిసొచ్చే అంశంగా ఉంది.

విద్యావేత్త భూస్వామిగా ఎలా మారారు ?

తన అక్రమార్జనతో చిరంజీవి రావు భూములు కొనుగోలు చేసిన వైనంపైనా విశాఖ జిల్లా పోలీసులు నిఘా పెట్టారు. ఒక్కొక్కటీ ఆరా తీసి బయటకు లాగుతూ నివేదిక మిగతా 2లో..

వైసిపి అధికార దుర్వినియోగానికి

అడ్డుకట్టవేయండి

ఎన్నికల కమిషన్‌ను కోరిన ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలలో వైసిపి అధికార దుర్వినియోగానికి ఎన్నికల కమిషన్ అడ్డుకట్ట వేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎన్నికోడ్ ఉల్లంఘనలపై పలుసార్లు ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మంగళవారం విశాఖ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసన మండలి ఎన్నికలో వైసిపి బరితెగించి వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని, వాలంటీర్ల వ్యవస్థను తమ అభ్యర్థి గెలుపు కోసం వాడుకుంటోందన్నారు. పలు సందర్భాలలో వీటిపై జిల్లా కలెక్టర్‌కు, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా, ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంతో మరింత రెచ్చిపోయి వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, సర్వశిక్ష అధికారులు, ఆనందపురం ఎంఇఒపై తాము సాక్ష్యాలతో సహా ఫిర్యాదు చేసినా వారిపై నేటికీ చర్య తీసుకోలేదన్నారు. ఎయు విసి వ్యవహారంలో తమకు దొరికిన సాక్ష్యాలు కూడా విచారణ అధికారికి దొరక్కపోవడం విడ్డూరంగా ఉందన్నారు. హోటల్‌లోని సిసి కెమెరాల పుటేజీలను వెంటనే తీసుకోవాలని తాము సూచించినా ఆ పని చేయలేదన్నారు.



మాట్లాడుతున్న అజశర్మ

కావాలనే సాక్ష్యాలను తారుమారు చేయడం తప్పు చేసిన వారిని కాపాడడానికేనన్నారు. విచారణల పేరిట కాలయాపన జరపడం, విచారణను కూడా కింది స్థాయి అధికారులతో నామమాత్రంగా చేయించడంతో అధికార పార్టీ తన పని తాను చేసుకుపోతోందన్నారు. ఈలోగా ఎన్నికలు పూర్తయ్యే అవకాశముందన్నారు. ప్రభుత్వం జీతాలు చెల్లించే వాలంటీర్ల వ్యవస్థను తన పార్టీ జేబు సంస్థగా మార్చేసిందని ఆరోపించారు. దొంగ ఓట్లు చేర్పించడం, నామినేషన్‌కు ప్రజలను తరలించడం, మిగతా 2లో..



యువతిని ఓటు అభ్యర్థిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

జిఐఎస్‌లోని ఎంఒయుల అమలుకు చర్యలు

వార్త 2లో..



మాట్లాడుతున్న వైవి.సుబ్బారెడ్డి, చిత్రంలో ఎంవివి, కృష్ణయ్య

గెలిపిస్తే ఉత్తరాంధ్ర గొంతుకవుతా

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే శాసన మండలిలో ఉత్తరాంధ్ర గొంతుకనవుతానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విభజన హామీల్లో భాగంగా విశాఖకు రైల్వేజోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, గిరిజన, పెట్రోలియం యూనివర్సిటీ హామీలు అమలు కాలేదని, వీటిపై శాసనమండలిలో గొంతు వినిపిస్తానని ఆమె చెప్పారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఎనిమిదేళ్లలో ఈ ప్రాంతానికి రూ.24 వేల కోట్లు రావాల్సి ఉండగా, రూ.450 కోట్లే ఖర్చు పెట్టారని విమర్శించారు. ఉత్తరాంధ్ర ప్రాంతం వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అక్రమాస్తులపైనా ఖాకీల ఆరా !

తయారు చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని పారిశ్రామికవాడలో 20 ఎకరాలకుపైగా, విజయనగరం జిల్లా అలమండలో సుమారు 15 ఎకరాలు, కొమ్మాది, ఎంవిపి, ఉషోదయ జంక్షన్, పెందుర్తిలలో కొన్ని చోట్ల వందల గజాల భూములు, షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నట్లు పోలీసులు గుర్తించి ఆ దిశగా విచారణ కొనసాగిస్తున్నారు.

వైసిపి అధికార దుర్వినియోగానికి అడ్డుకట్టవేయండి

పట్టభద్రులతో సమావేశాలు నిర్వహించడం వంటి పనులన్నింటికీ వీరిని వైసిపి వాడుకుంటోందన్నారు. ఇలా చేయడం అనుమతించరాదని తాము ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లా కలెక్టరుకు ఈ నెల 2న ఆదేశాలిచ్చారన్నారు. అయినా అవేవీ ఆగడంలేదన్నారు. తాజాగా 5వ తేదీన 3 గంటలకు జివిఎంసి 16వ వార్డులో అధికార పార్టీ వారు ఎన్నికల నిబంధన ఉల్లంఘించి సమావేశం నిర్వహిస్తున్నారని, తక్షణం ఆపాలని ఆ రోజు ఉదయం లిఖిత పూర్వకంగా తాము తెలిపినా కలెక్టర్ పట్టించుకోలేదన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే తమ ఓటమి ఖాయమని తెలిసే వైసిపి ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతోందని తెలిపారు. అధికార దుర్వినియోగాన్ని అరికట్టాలని, సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని తాము మంగళవారమూ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసినట్టు అజశర్మ వెల్లడించారు. విజ్ఞులైన ఉత్తరాంధ్ర పట్టభద్రులు అధికార పార్టీ ఉల్లంఘనలు, అడ్డదారులు, అక్రమాలను గుర్తెరిగి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, నిజాయతీగా, నిబద్ధతగా, నిస్వార్ధంగా పని చేస్తున్న 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

గెలిపిస్తే ఉత్తరాంధ్ర గొంతుకవుతా

పరంగా వెనుకబాటుకు పాలకుల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. సుజల స్రవంతి పూర్తయితే 8 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చేదని అభిప్రాయపడ్డారు. ఆమదాలవలస షుగర్ పరిశ్రమతో సహా మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు వైసిపి ప్రభుత్వం కనీస ప్రయత్నించకపోగా, ఒక మంత్రి చిట్టివలస జూట్ యాజమాన్యానికి సహకరించారని చెప్పారు. ఉత్తరాంధ్రలో అతి పెద్దదైన నెల్లిమర్ల జూట్ మిల్లు కూడా మూతపడిందన్నారు. పారిశ్రామిక, రసాయనిక వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెట్టడంతో మత్స్యసంపద దెబ్బతింటోందని చెప్పారు. ఉపాధి లేక మత్స్యకారులు వలసబాట పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదకరమైన కొవ్వాడ అణు విద్యుత్కేంద్రాన్ని ఉత్తరాంధ్ర ప్రాంతంపై రుద్దుతున్నారని విమర్శించారు.

రాష్ట్రానికి బిజెపి అన్యాయం

రాష్ట్ర విభజన చట్టం, ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, రైల్వేజోన్, మెట్రో రైలు, విద్యాసంస్థల నిర్మాణం వంటి అన్ని అంశాల్లోనూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయమే చేసిందన్నారు. రాష్ట్రానికి మేలు చేయకపోగా ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని విమర్శించారు. పట్టభద్రుల ఎన్నికల్లో ప్రభుత్వం అనేక అక్రమాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు. 250కు పైగా సంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా ఉత్తరాంధ్ర శాసన మండలికి పోటీ చేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు భవిరి కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఐక్యవేదిక నాయకులు పి.తేజేశ్వరరావు, కె.నాగమణి, ఎ.మహాలక్ష్మి, కూన వెంకటరావు, పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పొందూరు, జి.సిగడాం, రణస్థలం, పలాస మండలాల్లోని పలుచోట్ల మంగళవారం విస్తృత ప్రచారం చేశారు. పొందూరు సన్న ఖాదీని ప్రోత్సహించి, సబ్సిడీ, మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. పైడిభీమవరంలో వంద పడకల ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి, ఫార్మా, ఇతర రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి పాటుపడతానని తెలిపారు. ప్రచారంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, వెలమల రమణ పాల్గొన్నారు.

సురక్షిత బాల్యం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన సురక్షిత బాల్యం - బాలిక హక్కు అనే పోస్టర్‌ను ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు మంగళవారం బీచ్ రోడ్‌లోని బ్రిడ్జి స్కూల్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రమణి కుమారి, లక్ష్మి, శ్రీదేవి, దీప్తి పాల్గొన్నారు.

విశాఖ పోర్టు ట్రస్టును సందర్శించిన ఐఎఎస్‌ల బృందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నూతన ఐఎఎస్‌ల బృందం మంగళవారం విశాఖ పోర్టు ట్రస్టును సందర్శించింది. వారికి పోర్టు ఛైర్మన్ కె.రామమోహనరావు స్వాగతం పలికారు. అనంతరం పోర్టు పరిపాలనా కార్యాలయంలోని బోర్డ్ రూంలో వారితో సమావేశమయ్యారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిఎంపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా విశాఖ నగరంలో సమావేశం ఏర్పాటు చేసిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిఎం శ్రీనివాస్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు రైల్వే న్యూ కాలనీలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో సుధాకర్‌కు మద్దతుగా శ్రీనివాస్ ఆధ్వర్యాన ఎక్సైజ్ అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారన్నారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘనేనని, తక్షణం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోక్యం చేసుకుని చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే డిప్యూటీ కమిషనర్‌పైనా చర్యలు తీసుకోవాలన్నారు. వైసిపి అధికార దుర్వినియోగాన్ని ఎన్నికల కమిషన్ అడ్డుకోవాలన్నారు. మంచి చర్యలతో ప్రజలకు కమిషన్‌పై విశ్వాసం కల్పించాల్సిన అవసరముందన్నారు.

భీమా జ్యూయలరీ లక్కీడ్రా విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భీమా జ్యూయలరీ లక్కీ డ్రా విజేతలకు సంస్థ ఛైర్మన్ బి.గోవిందన్ బహుమతులు అందజేశారు. తమ జ్యూయలరీ సంస్థను 1925లో వ్యవస్థాపకులు లక్ష్మీ నారాయణ బట్టర్ అలెప్పి (కేరళ)లో ప్రారంభించగా అంచెలంచెలుగా ఎదుగుతూ విశాఖలో గత ఏడాది అక్టోబర్ 2న ఘనంగా ప్రారంభమైందన్నారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన లక్కీ డ్రా విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మీ నారాయణ బట్టర్ కుమారుడు ప్రస్తుత ఛైర్మన్ డాక్టర్ బి.గోవిందన్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. లక్కీ డ్రాలో మొదటి బహుమతి విజేత సిహెచ్.మేఘనకు హోండా యాక్టివా, రెండో బహుమతి విజేత ఎస్ఎస్ఎ శాస్త్రికి శాంసంగ్ రిఫ్రిజిరేటర్, మూడో బహుమతి విజేత హరీష్ పాత్రునికి ఎల్ఇడి టీవీ అందించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ గోవిందన్ మాట్లాడుతూ భీమా జ్యూయలరీని విశాఖలో ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఇంత మంచి ఆదరణ లభించడానికి కారణం ఆభరణాల ప్రత్యేకతేనని అన్నారు. వ్యాపారంలో 97 ఏళ్ల అనుభవం, ఆభరణాల తయారీలో 30 సంవత్సరాల అనుభవం కలిగిన నిపుణులతో కలిసి పయనిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ సిఇఒ రోహిత్ కృష్ణ, ఫైనాన్స్ హెడ్ ఆర్.శ్రీనివాస్, విశాఖ బ్రాంచ్ మేనేజర్, సహాయ బ్రాంచ్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.



లక్కీడ్రా విజేతలను ప్రకటిస్తున్న జ్యూయలరీ నిర్వాహకులు

జిఐఎస్‌లోని ఎంఒయుల అమలుకు చర్యలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్ల విలువైన ఎంఒయులు కుదుర్చుకున్నామని, 6.30 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ప్రాజెక్టులు త్వరలో రాష్ట్రంలో అమలు కానుందని వైసిపి రాష్ట్ర నాయకులు వైవి.సుబ్బారెడ్డి వెల్లడించారు. మంగళవారం నగరంలోని గ్రాండ్‌బే హోటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తమ ప్రభుత్వం అన్ని తరగతుల ప్రజానీకం సంక్షేమం చూడడంలో జన హృదయాల్లో స్థానం సంపాదించిందన్నారు. పరిపాలన రాజధాని విశాఖేనని, త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఇక్కడ నుంచే ప్రారంభం కానుందని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలను అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. పార్లమెంట్ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాజకీయాల్లో బిసిల పాత్ర 65 శాతం మేర జగన్ పాలనలో పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సీతంరాజు సుధాకర్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, కెకెరాజు, అదీప్‌రాజు, కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విక్రమ్‌కు వైవి.సుబ్బారెడ్డి అభినందన

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు వైసిపి యూత్ వింగ్ జోనల్ ఇన్‌ఛార్జిగా నియమితులైన అవనాపు విక్రమ్‌ను టిటిడి ఛైర్మన్, పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి అభినందించారు. విక్రమ్ మంగళవారం మర్యాదపూర్వకంగా సుబ్బారెడ్డిని కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ గెలిపించేందుకు కృషి చేయాలన్నారు.

సమాజంలో మహిళల పాత్ర ప్రశంసనీయం



మహిళా జర్నలిస్టులతో మేయర్ హరివెంకటకుమారి, జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర తదితరులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమాజ ప్రగతిలో మహిళల పాత్ర అత్యంత ప్రశంసనీయమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర కొనియాడారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగాల్లో సేవలందించిన వారితో పాటు ముగ్గులు, పాటల పోటీలలో విజేతలుగా నిలిచిన వారిని, అతిథులను ఫోరమ్ తరపున సత్కరించారు. వేడుకల్లో శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి, జిసిసి ఛైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ కొండా రమాదేవి, బ్రహ్మ కుమారీస్ ప్రతినిధి రామేశ్వరి పాల్గొన్నారు. మహిళల గొప్పతనాన్ని చాటిచెప్పారు. ఫోరమ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, కార్యదర్శి దాడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కొవ్వొత్తుల ప్రదర్శన

మహిళా చట్టాలను సమగ్రంగా అమలు చేయాలని మహిళా చేతన కార్యదర్శి కత్తి పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహిళా దినోత్సవం సందర్భంగా కొవ్వొత్తుల ప్రదర్శన, అనంతరం సభ నిర్వహించారు. చైతన్య స్రవంతి నాయకురాలు మాలిని, రామలక్ష్మి, సుచిత్ర పాల్గొన్నారు.

సూర్యతేజనగర్‌లో ఆక్రమణలు

సామాజిక అవసరాల కోసం ఉంచిన స్థలాల అమ్మకాలు
పట్టించుకోని జివిఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక మోడల్ కాలనీగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రాజీవ్ ఆవాస్ యోజన(రే) పథకంలో భాగంగా కాలనీని నిర్మించింది. ఈ కాలనీలో సామాజిక అవసరాల కోసం ఉంచిన మిగులు స్థలాలు, గెడ్డ అంచున ఉన్న స్థలాలపై అక్రమార్కులు కన్ను పడింది. వాటిని కాపాడాల్సిన కాలనీ పెద్దలు వార్డు కార్పొరేటర్ అండదండలతో దర్జాగా అమ్మేసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. జివిఎంసి లెక్కల ప్రకారం అప్పట్లో 40 గజాల చొప్పున 204 మందికి ఇళ్ల కేటాయించారు. వీరిలో 150 మందికి జి+1 గృహాలు, మరో 54 మందికి వ్యక్తిగత గృహాలు నిర్మించేందుకు అనుమతిస్తూ నిర్మాణాలు చేపట్టారు. దీనికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఒక్కొక్కరికి రూ.3.65 లక్షలు దఫదఫాలుగా అందజేశారు. లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టిన తరువాత సామాజిక అవసరాలకోసం కొన్ని స్థలాలను ఉంచారు. ఆ స్థలాలను, గెడ్డ అంచున ఉన్న స్థలాలను చదును చేసి గ్రామ పెద్దలు వార్డు కార్పొరేటర్ అండతో అమ్మేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కాలనీలో వ్యాయామశాల పేరుతో నిర్మించిన భవనాన్ని తాజాగా స్థానిక కార్పొరేటర్ ప్రధాన అనుచరుడు, వాలంటీర్ మనోజ్‌కు కట్టబెట్టారు. ప్రస్తుతం ఆయన కుటుంబంతో అందులో నివాసముంటున్నాడు. కాలనీలో యువకుల కోసం వ్యాయామ శాల నిర్మిస్తున్నామని చెప్పి వేరే వ్యక్తికి ఆ భవనాన్ని కట్టబెట్టడమేంటని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. కాలనీలో అవసరాల కోసం ఉంచిన మరి కొన్ని స్థలాలను కూడా ఇదే విధంగా అమ్మేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. మిగులు స్థలాలను అమ్మేసుకుంటున్నా సచివాలయ సిబ్బంది కానీ, జివిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు కానీ పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రే పథకంలో ఇచ్చిన లబ్ధిదారుల ఎంత మంది ఉన్నారు? ఎవరు నిజమైన లబ్ధిదారులు? మిగులు స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయని పక్కా సర్వే చేసి నిగ్గు తేల్చాలని స్థానికులు కోరుతున్నారు.



వాలంటీర్‌కు కట్టబెట్టిన వ్యాయామశాల కోసం కట్టిన భవనం

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఎఆర్ ఎఎస్ఐ మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఎఆర్ ఎఎస్ఐ శ్రీనాథు ఈశ్వరరావు మృతి చెందారు. ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... విశాలాక్షినగర్ రామాలయం వీధి సమీపంలో నివాసముంటున్న శ్రీనాథు ఈశ్వరరావు (63) ఎఆర్ ఎఎస్ఐగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. మంగళవారం తెల్లవారుజామున ఈశ్వరరావు తన ఇంటి సమీపంలో పాలదుకాణం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో హనుమంతువాక నుంచి విశాలాక్షినగర్ వైపు వస్తున్న మినీ వ్యాన్ ఢీకొట్టి, కొంత దూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. దీనితో ఈశ్వరరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు గాయపడ్డ ఈశ్వరరావును అపోలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఉదయం 9 గంటలకు మృతి చెందారు. మృతుడు ఈశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ సిఐ సోమశేఖర్ ఆధ్వర్యాన ఎఎస్ఐ చిన్నం నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి -గాజువాక : న్యూపోర్టు పోలీసుస్టేషన్ పరిధిలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి ఎఎస్ఐ అప్పలనాయుడు కథనం ప్రకారం... సంజీవగిరి కాలనీలో కొకెన్ బెహరా (21) గత కొంతకాలంగా ఒడిశా నుంచి వచ్చి భర్త శ్రీకాంత్‌బెహరాతో కలిసి నివాసముంటున్నారు. మంగళవారం తెల్లవారుజామున భర్త ఇంట్లో ఉంటుండగానే బాత్‌రూం గదిలోకి వెళ్లి చున్నీతో ఉరి వేసుకుని మృతిచెందింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని బయ్యవరం జాతీయ రహదారిపై రోడ్డు పక్కన టీ ట్రేడ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. దీనిపై గ్రామ రెవెన్యూ అధికారి డి.ఉదయకుమార్ పోలీసులకు మంగళవారం ఉదయం సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఎస్ఐ ఆదినారాయణ రెడ్డి చేరుకొని పరిశీలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది, ఎవరికైనా మృతుని వివరాలు తెలిస్తే కశింకోట పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



అలమండ మహేశ్వరరావు

మాజీ ఎంపిపి మృతి

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పెంట గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి అలమండ మహేశ్వరరావు గత కొంత కాలంగా అనారోగ్యంతో విశాఖపట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారు. అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. ఎన్‌టి.రామారావు సమయంలో మండల వ్యవస్థ ఏర్పాటైనప్పుడు మండల పరిషత్ కార్యాలయానికి ప్రథమ ఎంపిపిగా గెలుపొందారు. 1984 నుంచి 1989 వరకు పని చేశారు.

ఘనంగా మురళీకృష్ణ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఆనందపురం : వేములవలసలోని శ్రీ మురళీ కృష్ణ ఆలయం 16వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కీర్తిశేషులు పతివాడ వెంకటరమణ సోదరుడు పతివాడ నర్సింగరావు ఆధ్వర్యాన ఘనంగా పూజ కార్యక్రమాలు జరిపారు. మధ్యాహ్నం మూడు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామినాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : కొమార విద్యా కార్యక్రమంపై ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్థానిక ప్రభుత్వ డైట్‌లో పర్యువల్ పద్ధతిలో శిక్షణ ఇచ్చారు. డైట్ ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు ప్రారంభోపన్యాసం చేశారు. విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు కౌమార విద్య ఉపకరిస్తుందని స్పష్టం చేశారు. శిక్షణార్థులు అడిగిన సందేహాలను స్థానిక ప్రభుత్వ వైద్యులు హరిణి నివృత్తి చేశారు.

వైభవంగా అప్పన్న డోలోత్సవం



డోలోత్సవం సందర్భంగా అప్పన్న ఊరేగింపు

ప్రజాశక్తి-సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వార్షిక త్రి కళ్యాణోత్సవానికి సూచికగా మంగళవారం ఆలయ అర్చకులు అత్యంత వైభవంగా డోలోత్సవం నిర్వహించారు. ఏటా ఫాల్గుణ మాస శుక్లపక్ష పౌర్ణమి రోజున డోలోత్సవం, చూర్ణోత్సవము, వసంతోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. డోలోత్సవాన్ని పురస్కరించుకొని స్వామిని సుప్రభాత సేవతో మేల్కొల్పి పలు ఆరాధన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పల్లకిలో మెట్ల మార్గం గుండా కొండ దిగువ ఉద్యాన మండపంలోకి తీసుకొచ్చి స్వామి సోదరి అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారిని తన కుమార్తెను ఇచ్చి వివాహం జరిపించమని కోరారు. మొదట అంగీకరించకపోవడంతో స్వామి అలిగి ఉద్యాన మండపానికి చేరగా పెద్దలు అమ్మవారితో చర్చించారు. అమ్మవారు పెళ్లికి అంగీకరించడంతో అర్చక స్వాములు, గ్రామస్తులు, అధికారులు ఒకరిపై ఒకరు వసంతాలు జల్లుకొని చూర్ణోత్సవాన్ని, బెల్లం పాకాన్ని, వడపప్పు బెల్లాన్ని ప్రసాదంగా స్వీకరించారు. అనంతరం స్వామి వారు గ్రామ తిరువీధుల గుండా వెళ్లి భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం మెట్ల మార్గం గుండా కొండపైకి చేరుకోవడంతో ఈ ఉత్సవం ముగిసింది. ఈ ఉత్సవాన్ని గ్రామస్తులు బొట్టునడువు పున్నమిగా వ్యవహరిస్తారు. ఈ ఉత్సవంలో ప్రధానార్చకులు గోడవర్తి శ్రీనివాస్, రమణమూర్తి, గోపాల్, ఇతర అర్చక సిబ్బంది, దేవస్థానం ఎఇఒలు ఆనంద్ కుమార్, శ్రీనివాసరావు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు ట్రస్టు బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి గీతం ఎక్సలెన్స్ మీట్-23

ప్రజాశక్తి-మధురవాడ : వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలతో పాటు క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికి తీయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ ఈ నెల 16వ తేదీ నుంచి మూడు రోజులపాటు గీతం ఎక్సలెన్స్ మీట్ -23 (జెమ్) ను నిర్వహించనున్నట్లు కార్యక్రమ సిఇఒ, ఫ్యాకల్టీ సభ్యుడు డాక్టర్ షేక్ షంషుద్దీన్ తెలిపారు. జెమ్-23 సన్నాహకాలలో భాగంగా గీతం ప్రీమియర్ లీగ్ పేరిట క్రికెట్ పోటీలను గీతం క్రికెట్ స్టేడియంలో బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ అమిత్ భద్ర ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిశా రాష్ట్రాల నుంచి వివిధ విద్యా సంస్థలకు చెందిన 26 జట్లు ఈ పోటీలలో పాల్గొంటున్నాయని డాక్టర్ షేక్ షంషుద్దీన్ తెలిపారు. క్రికెట్ పోటీలతో పాటు వాలీబాల్, త్రోబాల్, బాస్కెట్ బాల్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఉత్సవంలో వాణిజ్య అంశాలపై వర్క్ షాప్‌లు, సమకాలిన కార్పొరేట్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చలు, విద్యార్థుల ఫ్యాషన్ షో, రాక్ బాండ్, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో జెమ్ -23 నిర్వాహక బృంద సభ్యులు, సీనియర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో క్రీడాకారులు

ఘనంగా పైడితల్లి అమ్మవారి జాతర

ప్రజాశక్తి - ఆరిలోవ : జాతీయరహదారిలో పాత డెయిరీఫారం వద్ద పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచే ఆదర్శనగర్, రవీంద్రనగర్, ఇందిరానగర్, హనుమంతువాక, విశాలాక్షినగర్, పెదగదిలి, చినగదిలి, దీనదయాల్‌పురం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, విఎంఆర్‌డిఎ చైర్మన్ అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు మీసాల రామలక్ష్మణులు అతిథులకు స్వాగతం పలుకుతూ దగ్గరుండి పూజలు చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆరిలోవ సిఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో ఆరిలోవ, ద్వారక పోలీస్‌స్టేషన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి గుడి నుంచి రవీంద్రనగర్ వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రసాదాల వితరణ..

జాతరకు వచ్చిన భక్తులకు వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మిరాజశేఖర్ ఆధ్వర్యాన పులిహోర, బిరియాని, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గాడు అప్పలనాయుడు, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, నమ్మి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అనంతుని డోలా మండప వేడుక

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభంలోని అనంతపద్మనాభస్వామి వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం డోలా మండప కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కుంతీమాధవస్వామి ఆలయంలో ఉన్న శ్రీదేవిభూదేవి సమేతుడైన అనంత పద్మనాభస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ప్రతిష్టించి గాలి గోపురం నుంచి గ్రామపురం వీదులో ఊరేగించారు. అనంతపద్మనాభ స్వామి కొండ చుట్టు ప్రదక్షిణ చేసి ఉత్తర దిశలో ఉన్న డోలా మండపానికి చేరుకుంది. అక్కడ డోలా మండపాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమమువలో ఎంపిపి కె.రాంబాబు, పద్మనాభం ఎంపిటిసి కె.లక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థినికి కేక్ తినిపిస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కార్పొరేటర్ కొండబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు పుట్టిన రోజు వేడుకలను చేపలుప్పాడలోని అతని క్యాంప్ కార్యాలయంలో మంగళ వారం ఘనంగా నిర్వహించారు. వైసిపి వార్డు అధ్యక్షులు పాల రమణారెడ్డి, పలువురు వైసిపి నాయకులు పుష్ప గుచ్చాలు అందజేసి పుట్టిన రోజు శు భాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. స్థానిక బీచ్ రోడ్డులో ఉన్న వారిజ ఆశ్రమానికి వెళ్లి చిన్న పిల్లలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. విద్యార్థినులకు కేక్ తినిపించారు.

రక్తహీనత నివారణకు చర్యలు

ప్రజాశక్తి- నక్కపల్లి: గర్భిణులలో రక్తహీనత నివారణకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారంమండలంలో గొడిచెర్లలో పిహెచ్‌సి ని సందర్శించారు. ముందుగా భవన మరమత్తు పనులను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు అందిస్తున్న సేవలపై ఆరా తీసారు. ఫ్యామిలీ ఫిజిషియన్ పోగ్రాం అమలుతీరుపై ఆరా తీశారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్న డీవార్మింగ్‌డే యాక్షన్ ప్లాన్ గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది పలు సూచనలు చేసారు.

కవగుంటలో పారిశుధ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో కవగుంట గ్రామంలో ప్రజలు అసౌకర్యానికి, అనారోగ్యానికి గురికాకుండా పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ దాసరి సూర్యకుమార్ వరహాలు తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలోని ప్రధాన కాలువలతోపాటు పిల్ల కాలువల్లోని పూడికలను తొలగించడంతోపాటు ఎక్కడా మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామంలో కంటముఖి రాము ఇంటి వద్ద మురుగు కాలువలను తొలగించి పైపులను ఏర్పాటు చేశామన్నారు. పారిశుధ్య పనులు చేపట్టేందుకు పంచాయతీ ఖాతాల్లో నిధులు లేనప్పటికీ, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అప్పు చేసి పారిశు ధ్య పనులు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి, గ్రామపంచాయతీలకు నిధులకు కేటాయిస్తే, ప్రజల అవసరాలకు తగ్గట్టుగా పనులు చేపట్టేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలకు నిధుల కొరతతో సంతృప్తికరమైన సేవలు అందించలేకపోతున్నామని, వీధిదీపాలు, తాగునీరు, పారిశుధ్యం వంటి కనీస పనులు చేపట్టలేకపోతున్నామని ఆవేదన వెలిబుచ్చారు.

స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి

- సిఎంకు ప్రొఫెసర్ చలం లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో జోనల్ వ్యవస్థ అమలు చేయాలని, ఆర్టికల్ 371 డి ప్రకారం స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మాజీ విసి, యుపిఎస్‌సి పూర్వ సభ్యులు ఆచార్య కెఎస్.చలం లేఖ రాశారు. ఆ వివరాలను ఆయన మీడియాకు మంగళవారం వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం శుభపరిణామన్నారు. ఇదే సందర్భంలో ఉత్తరాంధ్రలో వలసలను ప్రస్తావించారు. ఉత్తరాంధ్రలో జరుగుతున్న పారిశ్రామికీకరణ ఈ ప్రాంత ప్రజల వలసలను ఆపలేకపోయిందన్నారు. డిగ్రీలు చదువుకున్న విద్యార్థులు కూడా వలసలు పోతున్నారని తెలిపారు. స్థానికంగా లభిస్తున్న ఉద్యోగాలలో ఎక్కువ మొత్తాన్ని ఇతర ప్రాంతాల వారు ఎగరేసుకుపోతున్నారని, స్థానికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని లేఖలో పేర్కొన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలో 371డిని చేర్చి ప్రాంతీయ మండళ్ల ఉద్యోగాల్లో స్థానికులకు వెసులుబాటు కల్పించిందని, మన రాష్ట్రం విడిపోయిన తరువాత కూడా ఈ నిబంధనను ఉంచారని ప్రస్తావించారు. స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు అన్న హామీ అమలు కోసం ఉత్తరాంధ్ర యువత ఎదురు చూస్తోందని తెలిపారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సక్సెస్ మీట్

ప్రజాశక్తి -సీతమ్మధార : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యాన ఈ నెల 3, 4 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 విజయవంతమైందని రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కెకె రాజు అన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సక్సెస్ అయిన సందర్భంగా కెకె.రాజు ఆధ్వర్యాన మంగళవారం ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో సక్సెస్‌మీట్ ఏర్పాటుచేశారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ కేక్ కట్ చేశారు. అనంతరం టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ఈ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో భారతదేశంలోని అగ్రశ్రేణి కంపెనీలైన రిలయన్స్, అదాని, బిర్లా గ్రూపులతో పాటు పలు ప్రముఖ కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని చెప్పారు. ఈ సమ్మిట్‌లో 352 ఎంఒయుల ద్వారా రూ.13 లక్షల 40 వేల కోట్లు పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్ రానున్నాయని, తద్వారా 6 లక్షల పైచిలుకు ఉపాధి అవకాశాలు కలగనున్నాయని తెలిపారు. ఎక్కువ తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రకాల రవాణా కనెక్టివిటీ కలిగిన విశాఖ నగరాన్ని ముంబాయి నగరానికి దీటుగా ముఖ్యమంత్రి అభివృద్ధి చేస్తారన్నారు. రెన్యుబుల్ ఎనర్జీకి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో చేపడుతున్న పలు ప్రాజెక్టులు భారతదేశానికే రోల్ మోడల్‌గా నిలవనున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనీల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతిశ్రీనివాసరావు, కె.కామేశ్వరి, వి.ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు కె.వెంగళరావు, వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి దోపిడీపై ఛార్జిషీట్ కరపత్రం విడుదల

ప్రజాశక్తి -గాజువాక : నాలుగు సంవత్సరాల వైసిపి పాలనలో జరిగిన దోపిడీపై తెలుగుదేశం పార్టీ రూపొందించిన ఛార్జిషీట్ కరపత్రాన్ని గాజువాక నియోజకవర్గ తెలుగుదేశం సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఆధ్వర్యాన మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లోనే రూ.24 వేల కోట్ల విలువచేసే భూములను దోపిడీ చేశారన్నారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్ విషయంలో కేంద్రంతో వైసిపి కుమ్మక్కైందని ఆరోపించారు. విశాఖలో భూములు తనఖా పెట్టి సుమారు రూ.మూడు వేల కోట్లు అప్పు తెచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌డి రఫీ పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -నక్కపల్లి : స్థానిక మెయిన్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల పరిశీలకునిగా యూనియన్ జిల్లా కోశాధికారి జెవిఎస్‌పి. రాజు వ్యవహరించగా, యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షునిగా గారా రాజబాబు, ప్రధాన కార్యదర్శి టి.నానాజీ, గౌరవాధ్యక్షునిగా డిఆర్‌కె శాస్త్రి, సహాధ్యక్షులుగా గణేష్ చంద్ర, లక్ష్మీ ప్రసన్న, కోశాధికారిగా సిహెచ్‌ఎన్ఎన్ మూర్తి, కార్యదర్శులుగా జి.మహేష్, జి.ప్రవీణ్, పి.అప్పలరాజు, ఎస్.సతీష్, బి.దయావరలక్ష్మి, ఎం.శిరీష, ఎస్.ప్రసాద్, వి.లక్ష్మీనారాయణమ్మ, మహిళా కార్యదర్శిగా బి.నాగమణి, జిల్లా కౌన్సిలర్లుగా పి.వెంకటరావు, ఎ.శ్రీనివాస్, వై.ఉమాదేవి, పి.శ్రీకాంత్, మాడెం సత్యనారాయణ, ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా ఎం.బాబూరావు, కెవివి. సత్యనారాయణ, కె. రామచంద్రరావు, బి.లలితా రాణి, కల్చరల్ కమిటీ సభ్యులుగా ఈ.సత్యనారాయణ , మాడెం సత్యనారాయణ, ఎంఎస్ఎల్. ప్రశాంతి, అకడమిక్ కమిటీ సభ్యులుగా ఎం.అనిల్‌కుమార్‌రాజా, కె.జయరాజు, ఎస్‌విఎస్.రూప, సిపిఎస్. కమిటీ సభ్యులుగా ఎం.జయ నాయక్, పి.దుర్గాప్రసాద్, ఎ.మోహన్, జి.రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులందరూ సంఘ బలోపేతం ,ఉపాధ్యాయుల శ్రేయస్సు కొరకు నిరంతరం పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు.



ప్రతిజ్ఞ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పింఛన్ల సొమ్ములో పండగ మామూళ్లు కోతపై విచారణ



విచారణ కు హాజరైన పింఛనుదారులు

ప్రజాశక్తి- కొత్తకోట : రావికమతం మండలం కన్నంపేటలో పండగ పేరుతో లబ్ధిదారులకు ఇవ్వాల్సిన సామాజిక పింఛన్ల సొమ్ములో కోత పెట్టి వసూళ్లు చేసిన ఘటనపై మంగళవారం గ్రామ సచివాలయ కార్యదర్శి దాలినాయుడు విచారణ చేపట్టారు.బాధిత లబ్ధిదారుల నుంచి వాంగ్మూలం తీసుకున్నారు.

ఈ సందర్భంగా మధుమంతి పేరయ్య, దంట్ల సత్యనారాయణ, రామకోటి, శ్రీరామమూర్తి, వజ్రపు సాంబమూర్తి తదితర సుమారు 30 మంది పింఛనుదారులను విచారించగా, ఈ నెలలో తమకిచ్చిన పింఛను సొమ్ములో రూ.1250 నుంచి రూ.1500 వరకు వాలంటీర్లు కోత విధించి ఇచ్చారని వివరించారు ఇదేమిటని అడిగితే ఈ నెల 14న జరిగే ఆంజనేయస్వామి తీర్థం సందర్భంగా చందాలు వసూళ్లు చేయాలనీ స్థానిక సర్పంచ్ కుమారుడు దంట్ల శ్రీను, వైస్ ఎంపిపి దంట్ల వెంకటరమణ ఆదేశించడంతోనే వసూళ్లు చేస్తున్నట్లు వాలంటీర్లు చెప్పారని బాధిత పింఛనుదారులు విచారణ అధికారికి తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చందాలు వసూళ్ల చేయడం దారుణమన్నారు. గ్రామంలో సుమారు 245 మంది సామాజిక పింఛనుదారులు ఉండగా, పండగ పేరుతో సుమారు రూ. మూడు లక్షల వరకు వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. కాగా ఫిర్యాదు చేసిన వారికి మాత్రమే కోత విధించిన సొమ్ము తిరిగి ఇచ్చేస్తామని వాలంటీర్లు చెప్పడంతో కొద్దిసేపు అలజడి రేగింది. అందరికి తిరిగి చెల్లించాలని, లేదా బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని బాధితులు విచారణాధికారికి స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా సామాజిక పింఛన్లలో సొమ్ము కోతపై ఇఒపిఆర్‌డితో విచారణ చేయిస్తామని ఫిర్యాదుదారులకు చెప్పిన ఎంపిడిఒ వెంకన్నబాబు, గ్రామ సచివాలయ కార్యదర్శితో విచారణ చేయించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను బట్టి, ఫిర్యాదుదారులను మున్ముందు వేధించే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై బాధితులకు మున్ముందు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు అంటున్నారు.

'ఎల్‌జి నుంచి సరికొత్త ఏసీలు'

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎల్‌జి కంపెనీ నుంచి సరికొత్త ఫీచర్స్‌తో కూడిన ఏసీలను మార్కెట్లో రిలీజ్ చేయడం ఎంత సంతోషంగా ఉందని సంస్థ హెచ్‌ఎ డైరెక్టర్ హ్యాంగ్ సబ్‌కి పేర్కొన్నారు. డైమండ్ పార్క్ వద్ద గల సౌందర్య షాపింగ్ మాల్‌లో సరికొత్త ఫ్యూచర్స్ కలిగిన ఏసీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రీజినల్ బిజినెస్ హెడ్ వి.కృష్ణాజీ మాట్లాడుతూ, ప్రజలకు మరింత సౌకర్యంతమైన ఎయిర్ కండిషన్ కలిగిన ఎ 1కన్వర్ట్ 6, యువి నానో ప్లాస్మస్టర్ యోనైజర్, థింక్ వైఫై, విరాట్ మోడ్, సెన్సర్ డిస్‌ప్లే, హి గ్రోవెడ్ కాపర్, ఎడిసి సెన్సార్‌లో గ్యాస్ డిటెక్షన్ లాంటి అధునాతన సౌకర్యాలను అందిస్తూ తక్కువ విద్యుత్ వినియోగంతో రూపొందించినట్లు తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కెట్లో దీని విలువ రూ.35 వేల నుంచి రూ.1 లక్ష వరకు కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ యుగంధర్, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

10న దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -కంచరపాలెం : గొల్ల కంచరపాలెం రామాలయంలో గ్రామ అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యాన ఈ నెల 10వ తేదీన దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు శ్రీరామసేవ సమాజం (యాదవ) ప్రతినిధులు తెలిపారు. రామాలయ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లా సత్యనారాయణ మాట్లాడుతూ, శ్రీకోదండ సీతారామ, సంపత్ వెంకటేశ్వర స్వామి, ధనలక్ష్మిదేవి విగ్రహాల ప్రతిష్టను రేజేటి శ్రీరామాచార్యులు పర్యవేక్షణలో రేజేటి సీతారామచార్యులు ప్రతిష్టించనున్నట్లు వెల్లడించారు. 11వ తేదీన ఉదయం 10 గంటలకు సీతారాముల, శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణం ఒకే వేదికపై జరుగనున్నాయని తెలిపారు. ఆ రోజు అన్న సమారాధన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

వైభవంగా పైడిమాంబ పండుగ

ప్రజాశక్తి -కంచరపాలెం : జివిఎంసి 56వ వార్డు పరిధి కంచరపాలెం రామ్మూర్తి పంతులుపేట గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి పండుగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము మూడు గంటలకు గ్రామ అధ్యక్షుల తొలి పూజతో పండగ ప్రారంభమైంది. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. గవర కంచరపాలెం పైడిమాంబ కాలనీ, రాజీవ్‌కాలనీ, దయానందనగర్, చాకలిగెడ్డ, తిక్కవానిపాలెం, ధర్మానగర్‌రెడ్డి, కంచరపాలెం, గొల్ల కంచరపాలెం, ఊర్వశి కూడలి తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలి

విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం అందిస్తున్న మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం ఏయూ జియో ఇంజినీరింగ్ విభాగంలో పైథాన్ ప్రోగ్రామింగ్‌పై శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తయారుచేస్తున్నట్లు తెలిపారు.

పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి

పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ సత్యవతి

ప్రజాశక్తి-అనకాపల్లి

పాత్రికేకయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి.సత్యవతి అన్నారు. స్థానిక న్యూ కాలనీ రోటరీ కళ్యాణ మండపంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు బి వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సత్యవతి మాట్లాడుతూ విలేకరులకు ఇళ్ల స్థలాలు, బీమా సదుపాయం, రైల్వే పాసులు, అక్రిడిటేషన్ సమస్యలు, విద్యాలయాల్లో విలేకరుల పిల్లలకు 50 శాతం రాయితీ వంటి సమస్యలను ముఖ్యమంత్రితో పాటు సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, ఎంపిపి గొర్లి సూరిబాబు మాట్లాడుతూ అనకాపల్లి విలేకరులకు ఇళ్ల స్థలాల పంపిణీపై ఇప్పటికే రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ సానుకూలంగా ఉన్నారని, వీలైనంత త్వరలోనే పట్టాల పంపిణీ చేస్తామని చెప్పారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, విశాఖపట్నం అధ్యక్షులు నారాయణ, సీనియర్ నాయకులు జి.కాంతారావు, రవికుమార్ మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారుతున్న విలేకరుల కుటుంబాల్లో ఆర్థిక ప్రగతి లేదన్నారు. ఇళ్ల స్థలాల సమస్య దశాబ్దాలుగా పరిష్కారం కాలేదని, వీటి కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం విలేకరులకు యూనియన్ గుర్తింపు కార్డులు, వాహనాల స్టిక్కర్లు పంపిణీ చేశారు.



స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

ఎంపీ సత్యవతికి సత్కారం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపీ సత్యవతిని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యవర్గం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసరావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు నాయుడు బాబు, కార్యదర్శి చక్రవర్తి, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బి కొండలరావు, రామకృష్ణ, ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

129వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఒబి ప్రధాన గేట్ ముందు నేవీ నిర్వాసితులు చేస్తున్న ఆందోళన 129వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జెఎసి పెద్దలు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ నావికా స్థావరం నిర్మాణానికి సర్వం కోల్పోయిన తమకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. నేవీ నిర్మాణంతో సముద్రంలో చేపల వేట సాగక తమ ఉపాధి పోయిందని, తమ కుటుంబాల జీవనం సాగడం లేదని వాపోయారు. తమకు జీవన భృతి కల్పించాలని, జెట్టీ నిర్మాణం చేపట్టాలని, అంత వరకు నేవీ గేట్ లోపల నుంచి ఆధార్ కార్డు ఆధారంగా చేపల వేటకు అనుమతి ఇవ్వాలని, పెండింగ్ ప్యాకేజీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 8 గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.

జిల్లా సివిల్ సప్లై అధికారి ప్రసాద్ సస్పెన్షన్

ప్రజాశక్తి-అనకాపల్లి

డిప్యూటేషన్‌పై అనకాపల్లి జిల్లా సివిల్ సప్లై అధికారిగా పని చేస్తున్న కోనసీమ జిల్లా సివిల్ సప్లై అధికారి కెవిఎస్ఎం ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ కమిషనర్ ఎ.అరుణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసాద్ విధులు సక్రమంగా నిర్వహించనందుకు, అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చినందుకు గాను సస్పెండ్ చేసినట్లు ఆ ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు ప్రసాద్ సస్పెండ్‌లో కొనసాగుతారని తెలిపారు. అంతవరకు తమ ఆదేశం లేనిదే హెడ్ క్వార్టర్ విడిచి ఇతర ప్రాంతాలకు వెళ్ళరాదని ఉత్తర్వుల్లో తెలియజేశారు.

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలని మాడుగుల నియోజకవర్గం ప్రత్యేక అధికారి డిఎస్.అనిత అన్నారు. మంగళవారం దేవరాపల్లి వచ్చిన ఆమె మండల పరిషత్ కార్యాలయంలో బిఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. మండలంలో ఓటర్ కార్డులకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ చాలా మందకొడిగా సాగుతుందని, ఈ పనిని వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.లక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ డి.అరుణ్ చంద్ర, వీఆర్వోలు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నియోజకవర్గం ప్రత్యేకాధికారి అనిత

ఆర్థిక పరిపుష్టికి బ్యాంకులే మూలాధారం

కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి -అనకాపల్లి

దేశంలో ఏ ప్రాంతమైన ఆర్థిక పరిపుష్టి సాధించాలంటే బ్యాంకుల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి వెల్లడించారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం గత ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ త్రైమాసికంలో బ్యాంకులు సాధించిన లక్ష్యాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం కౌలు రైతులు, స్వయం సహాయక బృందాలలకు తగిన రుణాలను ఇచ్చి జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రభుత్వం, బ్యాంకులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత పట్ల ఉద్యోగులు, మహిళలు, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వెనుకబడ్డ ప్రాంతాలను గుర్తించి వాటి అభివృద్ధికి నిపుణులతో అధ్యయనం చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంకు జిల్లా అధికార ప్రతినిధి పూర్ణిమ, నాబార్డ్ జిల్లా అధికారి శ్రీనివాసులు, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, యుబిఐడిఆర్‌హెచ్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ తల్లి పండగకు భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని అంతకాపల్లి పంచాయతీ పరిధిలోని రావులమ్మపాలెం, అంతకాపల్లి, ఓమ్మివానిపాలెం గ్రామ ప్రజలు ఆరాధ్య దేవత శ్రీముత్యాలమ్మ తల్లి అమ్మవారి పండుగకు గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న బుధవారం తొలి వేల్పు సంబరం, 9న గురువారం అనుపు మహోత్సవం నిర్వహించినట్లు పేర్కొన్నారు. బుధవారం రాత్రి 12 గంటల నుండి పౌరాణిక నాటకాల్లోని గయోపాఖ్యానం యుద్ధ సీను, శ్రీ సత్య హరిచంద్ర వారణాసి కాటి సీను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 9న సాయంత్రం 4 గంటల అనుపు మహోత్సవం శతకంపట్టు దగ్గర జరుగుతుందని, సాయంత్రం 6 గంటల నుండి పలు సాంస్కృత కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఉత్సవ కమిటీ కోరింది.


మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ హేమంత్

ఆరోగ్యంపై మహిళలు జాగ్రత్తలు వహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న మహిళలు తమ ఆరోగ్య పట్ల కూడా తగిన శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్ పేర్కొన్నారు. మండలంలోని రేబాక గ్రామంలో మంగళవారం ఆయుష్మాన్ భారత్, బేటీ బచావో, లింగ వివక్ష నిర్మూలన, అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనత రాకుండా చూసుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న ఆకుకూరలు, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత వ్యాధి నుంచి బయటపడవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుశీల కౌశిక్, ఝాన్సీ రాణి, వైద్య సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షునిగా సతీష్

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షునిగా పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కడిమిశెట్టి సత్యనారాయణ (సతీష్) నియమితులయ్యారు. ఈ సందర్భంగా సతీష్‌ను పట్టణానికి చెందిన పలువురు వాణిజ్య ప్రముఖులు సత్కరించారు. అనంతరం సతీష్ మాట్లాడుతూ ఈ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పార్టీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని చెప్పారు.


సతీష్‌ను సత్కరిస్తున్న దిలీప్, మందపాటి, సూరిబాబు తదితరులు

ఆలోచింపజేసిన నాటికలు

ప్రజాశక్తి అచ్చుతాపురం

మండలంలోని హరిపాలెం గ్రామంలో కాండ్రేగుల వారి ఆధ్వర్యంలో రెండోరోజు సోమవారం రాత్రి నిర్వహించిన నాటికల ఆలోచింపజేస్తున్నాయి. గ్రామ దేవత పారిపల్లి అమ్మవారి పండగ సందర్భంగా కాండ్రేగుల భోగలింగం నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు రెండో రోజు సోమవారం రాత్రి కూడా కొనసాగాయి. పోటీలలో భాగంగా చీకటి పువ్వు, నాన్న నేను వచ్చేస్తా, ఇది కథ కాదు అనే నాటికలను ప్రదర్శించారు. ఈ నాటికలు సమాజానికి సందేశాతకమైన మార్పునకు, ఆదర్శమైన వంతమైన మార్గం చూపించాయి. ఆత్మహత్యలు సరికావు అనే సందేశం ఇచ్చాయి. మానవతా విలువలతో కూడిన జీవనం సాగించాలని మార్గం చూపించాయి.

విశాఖకు చెందిన భద్రం ఫౌండేషన్ వెల్ఫేర్ సొసైటీ కళాకారులు "ఇది కథ కాదు" అనే నాటికి ప్రదర్శించారు. ఆరిపాక ప్రభాకర్ మూల కథ అందించిన ఈ నాటికకు నాటకీకరణ, దర్శకత్వ బాధ్యతలు ఎస్.డేవిడ్ రాజు వహించారు. పేదల అత్యాశను ఆసరాగా చేసుకుని ధనార్జనే ధ్యేయంగా రోజుకొకటిగా పుట్టుకొస్తున్న బోగస్ చిట్ ఫండ్ సంస్థల మోసాలను కళ్ళకు కట్టినట్టు నాటికలో చూపించారు. ప్రతి సమస్యకు చావే పరిష్కారం కాదని, ఆలోచిస్తే ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, సమస్యలకు భయపడి బలవన్మరనాలకు పాల్పడకూడదని, ఆత్మహత్యలకు పాల్పడితే వారి మీదే ఆధారపడిన కుటుంబ సభ్యుల పరిస్థితి ఎలా ఉంటుంది అనే విషయాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ నాటికలో డేవిడ్ రాజ్, భాను ప్రకాష్, నూకరాజు, కుమారి, చందు, విజయ్, మోహిద్దీన్ నటించగా తేజ సంగీత సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కాండ్రేగుల భాగలింగం, కాండ్రేగుల హరి, కాండ్రేగుల జోగి నాయుడు, కె.రామ సదాశివరావు తదితరులు పాల్గొన్నారు. మంగళవారం ఉదయం పారిపల్లి అమ్మవారి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.


ఇది కథ కాదు నాటికలోని సన్నివేశం

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయోత్సవం



తాళ్లపాలెం జంక్షన్‌లో సంబరాలు చేస్తున్న గున్నయ్యనాయుడు, వైసిపి నాయకులు

ప్రజాశక్తి- అనకాపల్లి

విశాఖపట్నంలో రెండు రోజులపాటు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ జయప్రదమైందంటూ పట్టణంలోని వైసిపి ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు విజయోత్సవాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఎన్నడు జరగని విధంగా ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ జరిగిందన్నారు. ఈ సదస్సు ద్వారా అనకాపల్లి జిల్లాకు లక్ష 21 వేల కోట్ల రూపాయల పరిశ్రమలను తీసుకొస్తున్న ఘనత మంత్రి అమర్నాథ్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొర్లి సూరిబాబు, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ జి రామ్మూర్తి, అంటాకుల రత్న కుమారి, కార్పొరేటర్ మందపాటి సునీత, నాయకులు కొణతాల మురళీకృష్ణ, జాజుల రమేష్, పలక రవి, పెతకంశెట్టి జగన్మోహన్, గ్రైపూరి రాజు, కోరుకొండ రాఘవ, దాడి నారాయణరావు పాల్గొన్నారు.

కశింకోట : పారిశ్రామిక సదస్సు విజయవంతమైన నేపథ్యంలో మంగళవారం మండలంలోని తాళ్లపాలెం జంక్షన్‌లో కశింకోట ఎంపిపి కలగా లక్ష్మి భర్త గున్నయ్య నాయుడు ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. టపాసులు కాల్చారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఇంతటి ఘన విజయానికి కారకులైన సీఎం జగన్మోహన్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మలసాల కిషోర్, వియ్యపు భూలోక నాయుడు, కరకు సోమునాయుడు, హనుమంతు వెంకట లక్ష్మణరావు, కొట్టె రాము, కరణం శాంసన్, గొంతెన శివ బాబు, తెరపల్లి సంతోష్, నమ్మి గణేష్, లగిశెట్టి గణేష్, కోన నాగేశ్వరరావు, నీటిపల్లి దివాకర్, అద్దంకి సతీష్, ఇందల ముసలి నాయుడు, చిన్ని రాజీవ్, గాలి శ్రీనివాస రావు, కొప్పాక రామ గణేష్, కరకు శేషు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వెంకటరమణ

జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యత

ప్రజాశక్తి- అనకాపల్లి : జల వనరుల సంరక్షణకు యువత అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు కాంగ్రెస్ వెంకటరమణ అన్నారు. నైస్ మ్యాన్ పవర్ సొల్యూషన్ స్కిల్ డెవలప్మెంట్ కార్యాలయంలో ఎన్‌వైకె ఆధ్వర్యాన 'వర్షం నీటిని ఒడిసి పట్టండి' అన్న అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలుగా వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన డి.శంకర్, కె.తనుజారాణి, జి తేజశ్రీకు వెంకటరమణ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాను రాను నీటి కొరత ఏర్పడనున్న నేపథ్యంలో వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం భవనాల నిర్మాణ డిజైన్లలో నిబంధనలు విధించిందని తెలిపారు. ఎన్‌వైకె జిల్లా అధికారి జి మహేశ్వరరావు మాట్లాడుతూ చెక్ డాములు, ఇంకుడు గొయ్యిలు నిర్మాణం, చెరువుల నీటినిల్వ సామర్థ్యాలను పెంచేందుకు అనేక కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నైస్ మ్యాన్ పవర్ సొల్యూషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పిళ్ల రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌బిఐ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అదానీ అవతవకలపై విచారణకు కాంగ్రెస్ ధర్నా

ప్రజాశక్తి-కశింకోట : అదాని కంపెనీ అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కశింకోట స్టేట్ బ్యాంక్ ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రూ.50 వేల కోట్లు మేరకు జీవిత బీమా సంస్థ, భారతీయ స్టేట్ బ్యాంకుల నుండి అదాని తీసుకొని అవతకతవకలకు పాల్పడినట్లు అదాని కంపెనీపై హిడెన్ బర్గ్ పరిశోధన చేసి రిపోర్టు విడుదల చేశారని తెలిపారు. ఈ విషయంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మలుపురెడ్డి కోటేశ్వరరావు, బోయిన భానుమూర్తి, సూరా శ్రీనివాస్, సూరిశెట్టి ఆదిబాబు, బాల మురళి పాల్గొన్నారు.

వెంకటరమణకు మాజీ మంత్రి గొల్లపల్లి పరామర్శ

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : తురకపూడి మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు గంటల వెంకటరమణను మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు తదితరులు మంగళవారం పరామర్శించారు. వెంకటరమణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని ఆయన్ను పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలని సూచించారు. టిడిపి మండల అధ్యక్షులు గోకువాడ కోటేశ్వరరావు, డిసిసిబి మాజీ డైరెక్టర్ కోరుకొండ రవికుమార్, సాయం శేషు, మాజీ ఎంపిటిసిలు మరిసా సతీష్, గొన్నాబత్తుల శ్రీనివాసరావు, తెలుగు యువత మండల అధ్యక్షులు సేనాపతి మణికంఠ, మరిసా నరేష్, షేక్ వల్లి పాల్గొన్నారు.



వెంకటరమణతో మాట్లాడుతున్న గొల్లపల్లి తదితరులు

హాస్టల్ విద్యార్థులకు పునశ్చరణ తరగతులు



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని ఎ.కోడూరు సమీకృత వసతి గృహంలో 10వ తరగతి విద్యార్థులకు ఆ వసతి గృహం సంక్షేమ అధికారి పెంటకోట గంగునాయుడు ఆధ్వర్యంలో మంగళవారం పునశ్చరణ తరగతులు నిర్వహించారు. ఎ.కోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు ఈ తరగతులకు హాజరై పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలు, మెలకువల గురించి వివరించారు. విద్యార్థులు పరీక్ష హాలుకు అర్ధగంట ముందుగా వెళ్లాలన్నారు. ముందుగా ప్రశ్నా పత్రం పూర్తిగా చదవాలని, వచ్చిన ప్రశ్నలకు జవాబులు స్పష్టంగా రాయాలని సూచించారు. ఇచ్చిన సమయాన్ని బట్టి అన్ని ప్రశ్నలకు సమాధానాలు చక చక రాయాలని, తర్వాత మరలా ఒక్కసారి పరిశీలించుకోవాలని చెప్పారు. పరీక్షలు రాయడానికి వెళ్లే ముందు రోజు ఎప్పటిలాగే చదవాలని, ముందు రోజు రాత్రి ఎక్కువ సమయం మేల్కొని ఉంటే మనసుకు ప్రశాంతత లోపిస్తుందని, పరీక్షల్లో తెలిసిన ప్రశ్నలకు కూడా జవాబులు రాయడానికి ఇబ్బంది కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అనురాధ, ఉపాధ్యాయులు ఎం.పద్మావతి, రాధాకృష్ణ, రమాదేవి, బేగం, భారతి, జె.అమృతరావు, వైఎఆర్‌కె.ప్రసాదరావు, వసత గృహ సంక్షేమ అధికారి-2 డి.రమేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- ఎంపిపి కలగా లక్ష్మి



ప్రజాశక్తి -కశింకోట : మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని కశింకోట మండల పరిషత్ అధ్యక్షురాలు కలగా లక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే పొదుపు అవసరమని, దానిపై మహిళలు దృష్టి పెట్టాలని సూచించారు. తమ పిల్లలకు సరైన విద్యను అందించాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళల ఆర్థికాభివృద్ధితో పేదరికం తగ్గుదల

ప్రజాశక్తి- కశింకోట : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం ద్వారా పేదరికాన్ని తగ్గించవచ్చని ఎపిఎమ్‌ తిలక్ అన్నారు. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సౌజన్యంతో కశింకోట మండల మహిళా సమాఖ్యలో మంగళవారం రెండో రోజు శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం తగ్గింపు, ఆరోగ్యం, పౌష్టికాహారం, పారిశుధ్యం, చదువు, జెండర్, స్త్రీ పురుషులు సమానత్వం, ప్రకృతి వ్యవసాయం, ఉపాధి అవకాశాలు, రక్తహీనత నివారణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళ సమాఖ్య అధ్యక్షులు కె.అరుణ, కార్యదర్శి అప్పలనరసమ్మ, ఎపిఎం ఎస్.శ్రీనివాసరావు, సిసిలు, గ్రామ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలంలో ఈ నెలాఖరు వరకు గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు గవరపాలెం పశు వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో మంగళవారం 150 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏహెచ్ ఏ కావ్య, పశు వైద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న నాగవల్లి వసంతోత్సవం



సన్నాయి మేళాల నడుమ స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- వడ్డాది

వడ్డాది శ్రీగిరిజంబుగిరి కొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాల్లో తుది ఘట్టమైన నాగవల్లి వసంతోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ మెంబర్ దొండా శ్రీరామ్ ఆధ్వర్యంలో స్వామికి తిరువసంతోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. శారదా నదిలో స్వామి ఉత్సవ విగ్రహాలకు చక్రస్నానం చేయించారు. గ్రామమంతా రంగుల హోలీతో సందడి నెలకొంది. యువత ఉరకలేసిన ఉత్సాహంతో డ్యాన్స్‌లు చేశారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ, ప్రసాదం పంపిణీ చేశారు. స్వామివారి ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల గోవింద నామస్మరణతో గిరిజంపగిరి మారుమోగింది. పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు స్వామిని దర్శించుకున్నారు. కొండ దిగువన భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

వైసిపిలో చేరిన నాయీ బ్రాహ్మణులు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం టౌన్‌లోని చందక వీధికి చెందిన శ్రీలక్ష్మీ దుర్గ నాయా బ్రాహ్మణ సంఘం సభ్యులు సుమారు 50 మంది స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సమక్షంలో మంగళవారం వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మశ్రీ మాట్లాడుతూ తమ ప్రభుత్వంపై ఉన్న విశ్వాసంతో వైసిపిలో చేరిన వారందరికీ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలువలస గోవింద, జంపా సూరిబాబు, తామవరపు ప్రసాద్, మలివలస సన్యాసిరావు, శ్రీను, కోనేటి వాసు, అప్పారావు, మోహన్, జంప అమ్మాజీ, భవ్యవరపు రాంబాబు, అప్పలరాజు, శ్రీను, సత్తిబాబు, పాల్గొన్నారు.



వైసిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

గ్రామ దేవతల అనుపోత్సవాలు

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని అనేక గ్రామాల్లో గ్రామ దేవతల అనుపోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పరవాడ మండల కేంద్రంలో పైడితల్లి అమ్మవారి అనుపోత్సవం సందర్భంగా మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ఎంపిపి పైల వెంకట పద్మాలక్ష్మి శ్రీనివాస్, పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రాము నాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం తప్పుడు గుళ్ళు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాల మధ్య అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. తానాం గ్రామంలో పరదేశమాంబ అమ్మవారి పండగ సందర్భంగా జెడ్పిటిసి మాజీ సభ్యులు పైలా జగన్నాథరావు, సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ, జెడ్పిటిసి పిఎస్ రాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రావాడ, జాజులవానిపాలెం, దేశపాత్రునిపాలెంతో పాటు మండలంలోని 14 గ్రామాల్లో అమ్మవారి పండగలు అత్యంత వైభంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పలుచోట్ల మహిళా దినోత్సవం



బీమిలిలో మాట్లాడుతున్న డాక్టర్ షీలా ఇందిర

జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలను మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల మహిళలకు ఆటల పోటీలు ఏర్పాటుచేసి, విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

భీమునిపట్నం : స్థానిక మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.శోభారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపు నిచ్చారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఆదర్శ మహిళలను సత్కరించారు. డిపిఎం వైదేహి, హెచ్‌ఆర్ ఎపిఎం రేణుక, స్థానిక ఎపిఎం రంగారావు తదితరులు పాల్గొన్నారు

భీమునిపట్నం : మహిళల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని ఎయు డిపార్ట్ మెంట్ ఆఫ్ ఫిజియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షీలా ఇందిర అన్నారు. స్థానిక ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ షీలా ఇందిర మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా బ్యూటీ షియన్ కోర్సును మహిళా సాధికారత విభాగం కో-ఆర్డినేటర్ డి మాధురి ప్రారంభించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ పిఒలు డాక్టర్ జ్యోతి, అప్పలనాయుడు, శ్రీను, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : కణితి హైస్కూల్‌లో మేజిక్ బస్ ఆధ్వర్యాన మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఆటలాడిన ప్రతి ఒక్కరికీ బహుమతి ప్రధానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యప్రకాశరావు , పీడీ మన్నాజీ, మేజిక్ బస్ సిబ్బంది, శిక్షణ, పర్యవేక్షణాధికారి సురేంద్, అప్పారావు, శ్రీనివాస్, నాగమోహన, కమిటీ ఛైర్మన్ లలిత వైస్ ఛైర్మన్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : మేజిక్ బస్ ఆధ్వర్యాన భీమిలి మండలం, మజ్జిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామంలోని మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి హెచ్‌ఎం ఉషారాణి, మేజిక్ బస్ టిఎంఒ డి.రమేష్, వైఎం జి.దుర్గ బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు

పద్మనాభం : పద్మనాభం మండల కాంప్లెక్స్‌లోని వెలుగు కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలతో డిబేటు, కుర్చీలాట, మ్యూజికల్ చైర్, డ్యాన్స్, పాటలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వెలుగు పీడీ శోభారాణి మాట్లాడుతూ, మహిళ ప్రధాన పాత్రతో కుటుంబం అభివృద్ధిలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమములో ఎంపిడిఒ పి.రాధ, ఎపిఎం ప్రభాకర్, ఎరియా కో-ఆర్డినేటర్ సత్యనారాయణ.తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం : మర్రిపాలెం ఉడా లే-అవుట్‌లోని పశ్చిమ నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేశారు. అనంతరం మహిళకు ఆటలు పోటీలు నిర్వహించారు. కోలాటం ఆడించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎస్‌ఎ.రెహమాన్, గరికిన గౌరి, అడ్డాల కృపాజ్యోతి, బయ్యవరపు రాధ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : శాఖ గ్రంధాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మత్తల శ్రీదేవి, కొత్తపల్లి భానుమతి, పెందుర్తి సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రెటరీ వి.షణ్ముఖి, గ్రంధాలయాధికారి బి.సూర్యకళ, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఎంఎఎల్ కళాశాలలో సత్కారం

అనకాపల్లి :దేశంలో మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించిన నాడే దేశాభివృద్ధి సాధ్యమని ఏఎంఏఎల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి జయ బాబు అన్నారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కళాశాల మహిళా అధ్యాపకులను, నాన్ టీచింగ్ మహిళా సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కళాశాల సూపరింటెండెంట్ అనురాధ, మహిళా సాధికారత సమితి కన్వీనర్ జె.సామ్రాజ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

తెనుగుబూడి గురుకులంలో

దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి గురుకుల కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సిహెచ్.రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ డి.నాగేంద్ర మాట్లాడుతూ పసిప్రాయంలో లైంగిక దాడులకు బలైపోతున్న దురాగతాన్ని అరికట్టాలన్నారు. గురుకుల కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

అచ్యుతాపురం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం భవాని విద్యానికేతన్ ఆవరణలో మహిళా ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్ లత చేతుల మీదుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు రాధారమణి, కాత్యాయిని, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు, వైస్ ప్రిన్సిపల్ ఎం రామ్ కుమార్ పాల్గొన్నారు.

నర్సీపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని ఆకాంక్షించారు.

ముఖ్య అతిధి సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి మాట్లాడుతూ మహిళల హక్కులపై అవగాహన ఉండాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్.ప్రసన్న మాట్లాడుతూ స్త్రీ ప్రాముఖ్యతను వివరించారు. సిస్టర్ అనిత వాల్టేరు మాట్లాడుతూ స్త్రీలలో సేవా దృక్పథం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం సాంప్రదాయ వస్త్రధారణ, స్త్రీలపై పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు వాసవిదత్త, రామలక్ష్మీ,

మహిళలు ఆత్మన్యూనతను విడనాడాలి

జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి

అనకాపల్లి : మహిళలు ఆత్మన్యూనతను విడనాడి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి అన్నారు. స్థానిక వివి రమణ రైతుభారతిలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేసీ మాట్లాడుతూ సమాజంలో మహిళలు పోషిస్తున్న పాత్ర అత్యంత కీలకమన్నారు.

ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి లక్ష్మీపతి, ఆర్బిఐ ఏజీఎం పూర్ణిమ, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్



ప్రతిజ్ఞ చేయిస్తున్న జెసి కల్పనాకుమారి

సత్యనారాయణ మూర్తి, ఐసిడిఎస్ పిడి పాల్గొన్నారు.

'పది' పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -కొత్తకోట : పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించేందుకు సులభమైన పద్ధతులను అలవరచు కోవాలని మెమొరీ ట్రైనర్ గట్టా వరప్రసాద్ సూచించారు. మంగళ వారం కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలలో పాటించాల్సిన మెళకువలను సూచించారు. పరీక్షలంటే భయం పోగొట్టుకోవాలని, చదివిన పాఠ్యంశం గుర్తు ఉండేలా జ్ఞాపక శక్తి పెంపొందించు కోవాలని సూచించారు. టెక్నికల్ పద్ధతుల్లో పరీక్షలను రాయాలన్నారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం సత్యారావు, కమిటి చైర్మన్ నానాజీ తదితరులు వరప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు.



అవగాహన కల్పిస్తున్న వర ప్రసాద్

పశువులకు గాలి కుంటువ్యాధి టీకాలు

ప్రజాశక్తి- చీడికాడ : మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఉచితంగా వేయనున్నట్లు చీడికాడఏరియా పశు వైద్యశాల డాక్టర్ జి.గాయత్రీ దేవి తెలిపారు. మంగళవారం చీడికాడలో వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారు. చీడికాడ, ఖండివరం గ్రామాలలో డాక్టర్ ఎసిహెచ్ గణేశ్వరరావు ఆధ్వర్యంలో రెండు వేల పశువులకు టీకాలు వేశారు.

పాడిరైతులందరూ తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేయించాలని, ప్రభుత్వపరంగా ఉచితంగా వేస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లోని వెటర్నరీ అసిస్టెంట్‌ను గాలికుంటు వ్యాధిటీకాల కోసం సంప్రదించాలని డాక్టర్ గాయత్రిదేవి సూచించారు.

దుర్గామల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : నర్సీపట్నం శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో కాముని పౌర్ణమి (హోలి పౌర్ణమి) సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీచక్రపూజ నిర్వహించి, కనకదుర్గ మల్లేశ్వరస్వామి ఇరువురినీ ప్రత్యేకంగా అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ చైర్మన్ చెరుకూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో పురోహితులు శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. దేవస్థానం ఇఒ సాంబశివరావు పాల్గొన్నారు.

ఘనంగా పట్టాలమ్మ తీర్థం

ప్రజాశక్తి - రావికమతం: మండలంలో కవగుంట పంచాయతీ బుడ్డిబంద గ్రామ దేవత పట్టాలమ్మ తల్లి తీర్థం మంగళవారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి గ్రామస్తులు పెద్దఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గామ కమిటీ చర్యలు తీసుకుంది. సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఉపమాకలో భక్తుల కోలాహలం

కనులపండువగా వెంకన్న కల్యాణోత్సవాలు.. సముద్రస్నానాలకు పోటెత్తిన ప్రజలు



రాజయ్యపేట తీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ప్రజాశక్తి- నక్కపల్లి : వార్షిక కల్యాణోత్సవాలు జరుపుకుంటున్న ఉపమాక వేంకటేశ్వర స్వామి సన్నిధికి మంగళవారం పౌర్ణమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు రాకతో ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. గోవిందనామ స్మరణతో మారుమ్రోగింది. భక్తులు క్యూలైన్లలో గుండా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి ని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాదాచార్యులు, కష్ణ మాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందజేసారు. విధ్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఆలయం వద్ద భక్తులకు పులిహోరా, తాగునీరు పంపిణీ చేసారు. ఎడిఇ లక్ష్మణరావు, ఎఈ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. నక్కపల్లికి చెందిన మేడేటి శంకర్ భక్తులకు వాటర్ ప్యాకెట్లును సరఫరా చేశారు. నక్కపల్లికి చెందిన సున్న గుప్తా, నరసింహమూర్తి, శింగంశెట్టి బాబాజీ, సున్న మణి దీప్, సతీష్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేసారు.

వైభవంగా వెంకన్న చక్రస్నానం

వెంకన్న కల్యాణోత్సవాల్లో భాగంగా 5వ రోజు మంగళవారం రాజయ్యపేట సముద్రతీరంలో చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. రాజాధిరాజ వాహనంపై మాక గ్రామానికి 5కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజయ్యపేట సముద్ర తీరానికి స్వామిని ఉభయదేవేరులతో తీసుకెళ్ళి, స్వామి ప్రతిరూపమైన చక్రతీర్ధాళ్వార్లు (సుదర్శనమూర్తి) విగ్రహానికి సముద్ర జలాలలో స్నానం చేయించారు. రాత్రి ఉపమాక పురవీధుల్లో రథోత్సవాన్ని నిర్వహించారు తప్పెటగుళ్ళు ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

జనసంద్రంగా రాజయ్యపేట తీరం

ఫాల్గుణమాసం పౌర్ణమి సందర్భంగా సముద్ర స్నానాలకు భక్తులు తరలిరావడంతో రాజయ్యపేట సముద్రతీరం జనసంద్రాన్ని తలపించింది. ఆచరించారు.భారీ సంఖ్యలో భక్తులు రావడంతో. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా నక్కపల్లి నుండి ఉపమాక మీదుగా రాజయ్యపేట వరకు ఎస్ఐ శిరిష్ సిబ్బందితో కలిసి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. వాహనాలను దారి మళ్లించారు. పోలీసు గస్తీ, గజ ఈతగాళ్లను ఏర్పాటుచేసారు.



బాలికల కోలాట ప్రదర్శన

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

ఉపమాక వెంకన్న కల్యాణోత్సవాలు సందర్భంగా కల్యాణవేదిక వద్ద పలు గ్రామాలకు చెందిన బాల, బాలికలు, మహిళల కోలాట ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి .

కోరెడ్ల రమాప్రభ విజయానికి విస్తృత ప్రచారం

వామపక్షాల ఉమ్మడి ప్రచారం



ప్రచారంలో ఎం.రాంబాబు, ఎజె.స్టాలిన్, రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి -గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ గాజువాకలో విస్తృత ప్రచారం సాగింది. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ ఎజె.స్టాలిన్, సిపిఐ కార్యదర్శి కె.సత్యనారాయణ, చిన్నగంటాడ కార్యదర్శి విష్ణు, సిపిఎం జోన్ కార్యదర్శి ఎం రాంబాబు, సీనియర్ నాయకులు ఎన్.రాజేంద్రప్రసాద్, ఐద్వా నాయకులు కె.సంతోషం, జి.లక్ష్మి, ఎం.శ్రీదేవి, సిఐటియు నాయకులు లక్ష్మణరావు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరించిన సిపిఐ నేతలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఐ నేతలు

అనకాపల్లి : ఉత్తరాంధ్ర ప్రజా సమస్యలపైనా, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం అవగాహన ఉన్న, పోరాడే 250 ప్రజా సంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిపిఐ నాయకులు కోరారు. ఈ మేరకు సిపిఐ కార్యాలయంలో మంగళవారం రమాప్రభ బయోడేటా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం, మాజీ మున్సిపల్ కార్పొరేటర్ తాకాసి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు అబ్బులు, కోరిబిల్లి శంకర్రావు, ముక్కామల చిన్ని, కె.వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆర్.రాము మంగళవారం అచ్యుతాపురంలోని పలు కార్యాలయాలు, కళాశాలలు, హాస్పిటల్స్, ప్రైవేట్ పాఠశాలలు, బ్యాంకుల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కోరెడ్ల రమాప్రభను 250 ప్రజాసంఘాలు బలపర్చినట్లు చెప్పారు.

చోడవరం : డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ చోడవరం మండలంలో సీఐటీయూ, డివైఎఫ్ఐ, రైతు సంఘం, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఇంటికి తిరిగి విస్తృత ప్రచారం చేశారు. సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్‌వి.నాయుడు, శ్రీను, కళ్యాణ్, రైతు నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, వై.గణేష్ పాల్గొన్నారు.



సబ్బవరం ప్రచారంలో ఐద్వా నేత ప్రభావతి

సబ్బవరం : కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ మండలంలోని వంగలి, అమృతపురం, సబ్బవరం, అంతకాపల్లి గ్రామాల్లో మంగళవారం ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి ఆధ్వర్యాన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలపై శాసన మండలిలో పోరాడే కోరెడ్ల రమాప్రభను ప్రజాసంఘాలు బలపర్చాయని, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జక్కాన సత్యనారాయణ, జక్కాన రాము, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పాడ సత్యవతి, ఊడి బాలకృష్ణ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి



రమాప్రభకు సంఘీభావం తెలుపుతున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు

గాజువాక: స్టీల్‌ప్లాంట్ రక్షణకై పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ అభ్యర్థించారు. గాజువాక సిఐటియు కార్యాలయంలో స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు తమ అవసరాల నేపథ్యంలోనే ఈ పోరాటానికి మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. చిత్తశుద్ధితో కూడిన మద్దతు పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ ఇస్తారని చెప్పారు. స్టీల్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణే ప్రధాన ధ్యేయయంగా పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతిస్తున్నామని తెలిపారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, విశాఖ ఉక్కు కర్మాగారం మనుగడకు సొంత గనులు కటాయింపు కోసం పోరాటం చేయాలని, కోరెడ్ల రమాప్రభను గెలిపించడం ద్వారా పోరాటానికి బలం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు జిఆర్‌కె.నాయుడు, గల్లా శంకరరావు, సిహెచ్.సన్యాసిరావు, రాజబాబు, డేవిడ్, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ స్కూళ్ల మనుగడకు రమాప్రభ గెలుపు అవసరం

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ



మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ

గాజువాక: బడ్జెట్ స్కూల్స్ మనుగడ సాగించాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ పిలుపునిచ్చారు. రమాప్రభకు మద్దతుగా గాజువాక ఇండస్ట్రీస్ ఏరియా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన యశోద స్కూల్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంవిఎస్.శర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నీతి, నిజాయతీ, ప్రజల కోసం నిబద్ధతతో పనిచేసే రమాప్రభను గెలిపించాలని కోరారు. నూతన విద్యా విధానం వల్ల బడ్జెట్ స్కూళ్లకు నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. దాన్ని తిప్పికొట్టే సామర్థ్యం రమాప్రభకు ఉందన్నారు. 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, కరోనాకాలంలో నష్టాలు ఎదుర్కొన్న బడ్జెట్ పాఠశాలలకు ఆస్తి పన్ను మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిప్సా నాయకులు భాస్కరరావు, శ్రీనివాసరావు, పాలూరు లక్ష్మణస్వామి, డి.శ్రీనివాస్, ఎస్‌వికె.పరుశురాం, సిఐటియు నాయకులు ఎం.రాంబాబు, ఎ.లోకేష్, కిరీటం, సంతోషం, పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొని మద్దతు తెలిపారు.

అధిక ధరలకు పాలు విక్రయాలు

విశాఖ డెయిరీ నిర్వాహకుల తీరుపై వినియోగదారుల ఆగ్రహం



విశాఖ డెయిరీ పాలసేకరణ కేంద్రం

ప్రజాశక్తి - కోటవురట్ల: మండలంలో అధిక ధరలకు విశాఖ డెయిరీ పాల విక్రయాలు విక్రయిస్తుండడంపై వినియోగదారులు తీవ్ర అసంతృప్తి అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాల ప్యాకెట్లపై ఉన్న ఎంఆర్‌పి కంటే ఎకుకవ ధరలకు పాలు అమ్ముతుండడంపై ప్రశ్నిస్తున్నారు. విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రాల్లో ఒక్కో గ్రామంలో ఒక్కో ధరకు పాలను కొనుగోలు చేస్తున్నారన్నారు. ఆవు, గేదె పాలను డెయిరీ ధర కంటే అదనంగా రూ.10 నుంచి రూ.15వరకు అదనపు రేటుకు విక్రయిస్తున్నారని వాపోయారు. ఇదేమిటని ప్రశ్నిస్తే డెయిరీ నిర్వాహకులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో సేకరించిన పాలను ఇక్కడ వినియోగదారులకు అమ్మకుండా తరలించుకుపోవడం దుర్మార్గమని, దీనిపై సంబంధిత డెయిరీ యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.